క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి కృషి



అమరావతి: వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్‌గా నియమితులైన వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు(జాలయ్య)ను సోమవారం ఆయన స్వగ్రామం మల్లాదిలో వీజేఎల్ఎస్ యూత్ ఆధ్వర్యాన గ్రామస్తులు శాలువాలతో, గజమాలలతో సన్మానించారు. సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా తనను నియమించిన మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డికి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పారిశ్రామికవాడలో స్థలం ఆక్రమణకు యత్నం!



సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులోని పారిశ్రామికవాడ (ఎస్టేట్)లో స్థలాక్రమణకు గుర్తు తెలియని వ్యక్తి యత్నించాడు. గతంలో పారిశ్రామికవాడలో రహదారి పక్కన విలువైన స్థలాన్ని ఆక్రమించడంతో అధికారులు హెచ్చరికలు చేసి ప్రభుత్వానికి చెందినదిగా బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డును సైతం తొలగించి అక్కడ ఒక షెడ్డును తీసుకొచ్చి పెట్టారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రోగులకు భోజనం ప్యాకెట్లు



సత్తెనపల్లి: భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నిరుపేద రోగులకు కటకం సత్యనారాయణ, ధర్మపత్ని వెంకట నరసమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కటకం సాంబశివరావు ఆర్థిక సాయంతో సోమవారం భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. వైద్యశాలలో ఫిజియోథెరపీ వైద్యులు కరుణాకర్, జీవనజ్యోతి ముఖ్య అతిథులుగా హాజరై భోజనం ప్యాకెట్లను పేదలకు అందించారు. పథక బాధ్యుడు దివ్వెల శ్రీనివాసరావు దాతలకు, వారి కుటుంబ సభ్యులకు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జుననగర్ నందిగామ డొంక రోడ్డులోని సాధన అనాథ వృద్ధుల ఆశ్రమానికి డాక్టర్ విలియం కేరీ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు 25 కేజీల బియ్యాన్ని సోమవారం వితరణ చేశారు. సేవలు అందిస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు.

రోడ్డు ప్రారంభం



సత్తెనపల్లి: అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో శ్మశాన వాటిక వద్ద మేజర్ స్టామ్ వాటర్‌డ్రైన్‌పై రూ. 25 లక్షలతో నిర్మించిన కల్వర్టు, వింగ్ వాల్స్ నిర్మాణాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. 23వ వార్డు పరిధిలోని నరసరావుపేట రోడ్‌లో టీ టైం పక్కన రూ. 40 లక్షలతో నిర్మించిన మెటల్ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్, టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, యెల్లినేడి రామస్వామి పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదు.. యువకుడిపై కేసు

సత్తెనపల్లి : మహిళ ఫిర్యాదుతో యువకుడిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో సాయి కృష్ణ థియేటర్ ఎదుట నివసిస్తున్న జిల్లేళ్లమూడి భవాని ఇనుప కొట్టు పెట్టుకొని నివసిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు షేక్ కరీం అనే యువకుడితో 2022లో పరిచయమైంది. ఆమె షాపులో గుమాస్తాగా కొంత కాలం పని చేశాడు. తదనంతర పరిణామాలతో ఆమె ఈ ఏడాది ఫిబ్రవరిలో నరసరావుపేట రోడ్డులో ఫుడ్‌కోర్టు పెట్టారు. అతను ఆ షాపులో కొద్ది రోజులు పని చేసి మానేశాడు. అయితే వాళ్లిదరూ ఉన్న ఫొటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేసింది. కరీంపై అత్యాచారం, ఐటీ యాక్ట్ కింద పట్టణ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి, మిర్చికి అపార నష్టం

- కృష్ణా తీర ప్రాంతంలో కష్టం
- పరిహారం అంశంలో ప్రభుత్వం మీనమేషాలు
- నాలుగు రోజులు నీటిలోనే మొక్కలు
- కోలుకునే పరిస్థితి లేదంటున్న రైతులు



తాడువాయిలో నీటమునిగిన పత్తి మొక్కలు



కోగంటివారిపాలెంలో మిర్చి మొక్కలు కనిపించనంతగా పాచిపట్టిన భూములు

అచ్చంపేట: పత్తి, మిర్చి సాగు కష్టమవుతోంది. ఇటీవల పులిచింతల ప్రాజెక్టు నుంచి 7లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీరు వదలడంతో కృష్ణానదీ తీర ప్రాంతాల్లో మిర్చి, పత్తి పంటలకు అపార నష్టం వాటిల్లింది. పరిహారం రాయడంలో అధికారులు మీనవేషాలు లెక్కిస్తున్నారు. పైనుంచి తమకు ఉత్తర్వులు రాలేదని, ఈ క్రాప్ చేయించుకోవాలని సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం భూమిలో పత్తి వేయాలంటే సుమారు రూ.40వేలు ఖర్చు అవుతుంది. అదే మిర్చి పంట అయితే లక్ష పైనే అవుతుంది. ఇప్పుడిప్పుడే వేసిన మిర్చి నారు, అడుగు లోతుకూడా పెరగని పత్తి పంట మూడు, నాలుగు రోజులపాటు నీళ్లలో మునిగిపోయి పూర్తిగా వడపడిపోయాయి. ఈ పంటలు తిప్పుకునే అవకాశమే లేదు. తిరిగి మొత్తం దున్నుకుని పంట వేయాల్సిందేనని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం ప్రాథమిక సూత్రాలు పాటిస్తే పత్తి పంట తిప్పుకుంటుందని చెబుతున్నారు.

400 ఎకరాలకు పైగా పత్తి, 100 ఎకరాలకు పైగా మిర్చి పంటలకు నష్టం

మండలంలోని మాదిపాడు మొదలుకుని, గింజుపల్లి, చల్లగరిగ, తాడువాయి, చింతపల్లి, పుట్లగూడం, కొత్తపల్లి, చామర్రు, కోగంటివారిపాలెం, అంబడిపూడి, కోనూరు, కస్తల తదితర కృష్ణా నదీ తీర గ్రామాల్లో వేసిన పంటలు మొత్తం దాదాపు పీకేసి మళ్లీ వేసుకోవాల్సిన పరిస్థితులున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో పత్తి, 100 ఎకరాలకు పైగా ఇప్పుడిప్పుడే వేస్తున్న మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కోగంటివారిపాలెం, కోనూరులో సుమారు 150 ఎకరాల్లో పత్తి దెబ్బతిన్నదని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

పాచిపట్టిన భూములు

మిర్చి మొక్కలు నాలుగు రోజులుపాటు నీటిలో మునిగి ఉండటంతో మొక్కలు పూర్తిగా వాడిపోయి, భూమిపై పొరలు పొరలుగా పాచిపట్టింది. ఆ భూముల్లో తిరిగి వ్యవసాయ చేయాలంటే మొదటి నుంచి ఎత్తుకోవాలిసిందే. దుక్కులు దున్నే నుంచి మిర్చి నారు తిరిగి కొనుగోలు, వాటిని నాటడం, వాటికి బలం మందులు, యూరియా వంటివి వేయడం మొత్తం చేయాల్సింది. ఇలా చేయాలంటే ఎకరాకు మిర్చి పంటకు సుమారు రూ.70 వేల నుంచి లక్ష రూపాయల వరకు అవుతుందని చెబుతున్నారు.

పత్తి, మిర్చి రెండూ నష్టమే...



ఐదు ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మిర్చి పంట వేశా. మొత్తం నది ఒడ్డు పొలాలే కావడంతో పూర్తిగా మునిగి పోయాయి. మిర్చి పంటలో మొక్కలు పూర్తిగా వాడిపోయి నేలపై పాచిపట్టింది. పత్తి కూడా పీకేసి కొత్తగా మరో పంట వేసుకోవాలి. వ్యవసాయాధికారులకు చెప్పాం. వచ్చి చూచిపోయారు. ఏమిచేస్తారో చూడాలి.

– సుంకర శ్రీనివాసరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

అదునుపోయిన పత్తి

పత్తిపంటకు అదును పోయింది. పత్తి మొక్క పూత, పిందె పడే దశలో నాలుగు రోజులపాటు నీటిలో మునిగిపోవడంతో మొక్క పూర్తిగా కమిలిపోయింది. ఈ పంటకు అదును పోవడంతో మళ్లీ దుక్కులు దున్ని వేరే పంటలు వేసుకోవలసిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటివరకు వేసిన యూరియా, బలం మందు కట్టలు మొత్తం నీటి ప్రవాహానికి కొట్టుకొని పోయాయి. వేరే పంట వేసుకోవాలంటే మళ్లీ అన్ని మొదలు పెట్టుకోవాలని రైతులు చెబుతున్నారు.

పత్తిపంట తిప్పుకునే అవకాశం ఉంది



మిర్చి ఉద్యానవనశాఖ కిందకు వస్తుంది. ఇప్పటివరకు తమకు అందిన సమాచారం మేరకు పత్తి 80 ఎకరాల్లో మాత్రమే పూర్తిగా దెబ్బతింది. మిగిలినది తిప్పుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. పరిహారం విషయం ఎలా నిర్ణయించాలో స్పష్టమైన ఆదేశాలు రాలేదు. మేము ఎన్యుమరేషన్ చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. దీనిపై ఇంతవరకు స్పష్టత లేదు.

– పి.వెంకటేశ్వర్లు, ఏవో, అచ్చంపేట

భూమిని కాపాడమంటే కించపరుస్తున్నారు

గేరా ఆదాం

నకరికల్లు: భూసమస్యను పరిష్కరించకుండా కించపరుస్తూ మాట్లాడుతున్నారని గేరా ఆదాం రెవెన్యూ అధికారులపై మండిపడ్డాడు. సోషల్ మీడియాలో తనకు జరిగిన అన్యాయాన్ని సోమవారం వెల్లడిస్తూ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయిస్తున్నట్లు పేర్కొన్నాడు. తనకున్న 12సెంట్ల స్థలంలో దారి ఇవ్వాలంటూ పక్కభూమి యాజమాని నేలటూరి వెంకటేశ్వర్లు ఒత్తిడి తీసుకువస్తున్నాడన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మంత్రి లోకేష్ వద్ద పలుకుబడి ఉందని, అధికారులు తనకు అనుకూలంగా ఉంటారని బెదిరిస్తూ తన పట్టా భూమిలో అక్రమంగా రోడ్డు వేసుకున్నాడని వాపోయాడు. కోర్టులో కేసు ఉన్నా స్పందనలో అర్జీలు ఉన్నా నాలుగుసెంట్ల భూమిని ఆక్రమించుకొని రోడ్డు వేసుకున్నాడన్నారు. తనకు న్యాయం చేయాలని అధికారుల వద్దకు వెళితే రెవెన్యూ, వీఆర్వో, సర్వేయర్, పోలీసు అధికారులు న్యాయం చేయకపోగా కించపరుస్తూ మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన న్యాయం జరగకుంటే ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నాడు. దీనిపై తహసీల్దార్ కె.పుల్లారావును వివరణ కోరగా దారికి సంబంధించిన సమస్యను డాక్యుమెంట్ ప్రకారం పరిశీలించామన్నారు. తాము ఎలాంటి కించపరిచే వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు.

నేడు వాల్మీకి మహర్షి జయంతి

సత్తెనపల్లి: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు పట్టణంలోని వాల్మీకినగర్‌లో ఆయన విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా జరుగుతాయని వాల్మీకి బోయ సంఘ బాధ్యుడు ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోరాట యోధుడు వడ్డే ఓబన్న

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి



సత్తెనపల్లిలో ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుధీర్‌భార్గవ్‌రెడ్డి , నేతలు

సత్తెనపల్లి: స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న పోరాట యోధుడని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం వడ్డే ఓబన్న వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఓబన్న జీవిత చరిత్ర చారిత్రాత్మకమని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఓబన్న చూపిన అడుగుజాడల్లో నేటి యువత నడవాలన్నారు. బ్రిటిష్ వారు ప్రజలపై అక్రమంగా విధించిన పన్నులకు, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టిన రైతువారి పద్ధతికి వ్యతిరేకంగా ఓబన్న పోరాడారన్నారు. ఈ సందర్భంగా పలువురు వడ్డే ఓబన్న పోరాటపటిమను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, గుజ్జర్లపూడి సతీష్, చిలుకా జైపాల్, గడ్డం వెంకటేశ్వర్లు(బుల్లోడు), బండి మల్లికార్జునరెడ్డి, సయ్యద్ ఘోరా, నందిగామ ఆదాం, తుమ్మల వెంకటేశ్వరరావు, చిలుకా రమణయ్య, జూపల్లిపాల్, కొమెర శివశంకర్, వడ్డెర సంక్షేమ సంఘ నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, వేముల వరప్రసాదరావు, పల్లపు అంకమ్మరావు, వేముల శ్రీదేవి, ప్రభాకర్, మన్నెం వెంకటేశ్వర్లు, కందుల నాగేశ్వరరావు, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వైద్య సేవలందించాలి



దొడ్లేరు(క్రోసూరు): ఆరోగ్య విస్తరణాధికారిగా శిఖాశాంసన్ మరిన్ని సేవలను ప్రజలకు అందించాలని వైద్యసిబ్బంది కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న శిఖాశాంసన్‌ను సోమవారం వైద్య సిబ్బంది మండలంలోని దొడ్లేరు ఆరోగ్య ఉప కేంద్రంలో ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ శాంసన్ వైద్య ఆరోగ్య శాఖలో క్రమశిక్షణతో, నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. అనంతరం సబ్‌సెంటర్ వైద్య సిబ్బంది శాంసన్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికల అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు భూలక్ష్మి, ధనలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, లావణ్య, అనుపమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి వైఎస్సార్ సీపీ పార్లమెంట్ స్థాయి సమావేశం విజయవంతం చేయండి



డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: నరసరావుపేటలోని ఏ-1 ఫంక్షన్ హాల్లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరిగే వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్లు, పట్టణ అధ్యక్షులు, అధికార ప్రతినిధులు, సమావేశంలో భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఎఫ్ఏ 2 పరీక్షలు నిర్వహించాలి



సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు కృష్ణ, గణేష్

క్రోసూరు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఏ 2 పరీక్షలు తప్పకుండా నిర్వహించాలని ఎంఈఓలు డి.కృష్ణ, గణేష్ చెప్పారు. సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సెమిస్టర్ 2 పుస్తకాలను పాఠశాలల విద్యార్థులందరికీ పంపిణీ చేయాలని సూచించారు. ఈ నెల 13, 14, 15, 16 తేదీల్లో ఎఫ్ఏ 2 పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. సిలబస్ మొత్తం పూర్తి చేసుకోవడం, పిల్లల హాజరు శాతం మెరుగుపడటానికి ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు జి.సదాశివరెడ్డి, బాజీ, నరుద్దీన్, ముసలారెడ్డి, కిరణ్,సుబ్బారావు, సీఆర్పీలు సత్తారు, సుభాని, రాంబాబు, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

'సత్తెనపల్లి'కి నాలుగు స్వచ్ఛాంధ్ర అవార్డులు



స్వచ్ఛాంధ్ర పురస్కారాన్ని అందుకుంటున్న నందిగామ సర్పంచి రమాదేవి తదితరులు

సత్తెనపల్లి: ప్రభుత్వం స్వచ్ఛత కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ తొలిసారి ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు -2025లో సత్తెనపల్లి మండలానికి నాలుగు అవార్డులు దక్కినట్లు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పేరుతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా అవార్డులను ప్రకటిస్తోందని, అదే బాటలో స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేస్తున్నారన్నారు. జిల్లా స్థాయిలో 16 విభాగాల్లో 51 మంది వ్యక్తులు, సంస్థలు అవార్డులు దక్కించుకోగా వాటిలో నాలుగు పురస్కారాలు సత్తెనపల్లి మండలానికి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతలకు కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు సోమవారం పురస్కారాలు అందజేశారన్నారు.

సత్తెనపల్లి మండలానికి సంబంధించి స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో భట్లూరు, గుడిపూడి, నందిగామలకు పురస్కారాలు దక్కాయన్నారు. భట్లూరు సర్పంచ్ ఈదర రామారావు, గుడిపూడి సర్పంచ్ తొరటి తిరుపతయ్య, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, భట్లూరు పంచాయతీ కార్యదర్శి చెల్లంచర్ల శ్రీనివాసరావు, నందిగామ పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చిలువూరు కృష్ణప్రసాద్‌లు ఈ పురస్కారాలు అందుకున్నారన్నారు. ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ విభాగంలో నందిగామలో పనిచేస్తున్న హరితరాయబారి గరికపాటి మరియమ్మకు పురస్కారం వరించిందన్నారు.

క్రోసూరు పాఠశాలకు జిల్లా స్థాయి అవార్డు

క్రోసూరు: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పురస్కారాల్లో భాగంగా పాఠశాలల విభాగంలో క్రోసూరు ఆదర్శ పాఠశాలకు జిల్లా స్థాయిలో స్వచ్ఛ పాఠశాల అవార్డు లభించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మేరీసూజన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసరావుపేట టౌన్‌హాల్లో కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదు పాఠశాలలకు అవార్డులు రాగా అందులో క్రోసూరు ఆదర్శపాఠశాల ఒకటని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ ఎల్.చంద్రకళ, ఎంఈఓ గణేష్, ఎంపీడీవో రవికుమార్, డెప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేట గ్రామ పంచాయతీ జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర 2025 అవార్డును కైవసం చేసుకుంది. ఈ మేరకు సోమవారం పల్నాడు కలెక్టర్ కృతికాశుక్లా చేతుల మీదుగా సర్పంచ్ షేక్ జాని, పంచాయతీ కార్యదర్శి పంతులూనాయక్‌లు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాని మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో పంచాయతీకి అవార్డు వచ్చిందని, ఇకపై కూడా గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ప్రతి పాఠశాలలో భూసార పరీక్షలు చేయండి



భూసార పరీక్షల ప్రయోజనాలు వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి యాకోబు

నకరికల్లు: ప్రతి పాఠశాల పరిధిలో 50కి పైగా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయాధికారి పి.యాకోబు సూచించారు. భూసార పరీక్షల ప్రయోజనాలు వివరిస్తూ దేచవరం ఆదర్శపాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలాకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తే ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు లేని వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరీ, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, డీఆర్‌సీ ఏఓ ఎం.అరుణ, ఏఈఓ పి.విజయదుర్గ, వీఏఏ పి.పవన్‌కుమార్, ఉపాధ్యాయినిలు కె.శ్యామల, ఎం.రూతు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ వద్ద అప్రమత్తం

తాలూకా సెంటర్‌లో త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నిర్మాణం దశలో బస్‌షెల్టర్



షెల్టర్ వద్ద రెండు బస్సుల మధ్యలో ఇరుకున్న ద్విచక్ర వాహనం

సత్తెనపల్లి: స్థానిక తాలూకా సెంటర్‌లో కొత్తగా నిర్మిస్తున్న బస్‌షెల్టర్ వద్ద అప్రమత్తంగా ఉండాలి. కొండమోడు – పేరేచర్ల జాతీయ రహదారి కావడంతో ఇటువైపు వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. డివిజన్ కేంద్రమైన సత్తెనపల్లికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ప్రజల రాకపోకలు పెరిగినా ఆ మేరకు రోడ్ల విస్తరణ జరగలేదు. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని గుంటూరు, అమరావతి, నరసరావుపేట బస్సులు ఆగే ప్రాంతంలో సరైన బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో గుంటూరు బస్సులు ఆగే ప్రాంతంలో మాత్రమే రెండు బస్సు షెల్టర్లు నిర్మాణానికి పాలకులు చర్యలు తీసుకున్నారు. అక్కడ స్థలం ఉండటంతో అన్న క్యాంటీన్‌కు ముందు వైపు ఒకటి, రోడ్డుకు దగ్గర్లో మరొకటి బస్‌షెల్టర్లు నిర్మించేలా ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కన బస్‌షెల్టర్ వద్ద ఒక బస్సు ఆగితే మరో బస్సు వచ్చే పరిస్థితి లేకుండా ఇబ్బందికరంగా మారింది. రహదారి పక్కనే నూతనంగా బస్‌షెల్టర్ నిర్మాణం జరుగుతుండగానే సోమవారం సత్తెనపల్లి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఆగింది. దాని వెనుక పట్టణంలోని నాగార్జుననగర్‌కు చెందిన శ్రీను అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి మాచర్ల డిపో బస్సు వచ్చి ఢీ కొట్టింది. దీంతో రెండు బస్సుల మధ్యలో ద్విచక్ర వాహనం ఇరుక్కుంది. వాహనచోదకుడు శ్రీను ముందుకు దూకడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అతను గాయాల పాలై ప్రాణాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఘటన చూసిన ప్రతి ఒక్కరూ బస్ షెల్టర్ నిర్మాణం రహదారికి ఆనుకొని నిర్మించడం ఏంటని వ్యాఖ్యానిస్తున్నారు.

హైదరాబాద్ సంస్థకు నిర్మాణ బాధ్యతలు

గుంటూరు బస్సులు ఆగే ప్రాంతంలోని తాలూకా సెంటర్‌లో జరుగుతున్న రెండు బస్‌షెల్టర్ల నిర్మాణ బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన రెయిన్‌బో అడ్వర్టైజింగ్ అవుట్‌డోర్ మీడియా అనే సంస్థకు అప్పగించారు. ఈ రెండు బస్‌షెల్టర్లలో 65 నుంచి 70 మంది ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా ప్రచార సంస్థ సొంత ఖర్చుతో నిర్మాణం చేపడుతోంది. 12 ఏళ్లపాటు దీని నిర్వహణ బాధ్యతలను కూడా ఆ సంస్థే చూసుకోవలసి ఉంది. రెండు బస్ షెల్టర్ ప్రాంగణాల్లో మున్సిపాలిటీకి ఎలాంటి ఫీజులు చెల్లించకుండా ప్రచార బోర్డులను ఏర్పాటు చేసుకునే అవకాశం ఆ సంస్థకు కల్పించారు. ఇప్పటికే ప్రచారాల నిమిత్తం పెద్ద ఎత్తున వసూళ్లు చేపట్టాల్సి ఉంది. అయితే భవిష్యత్తులో 12 ఏళ్లకు వాటి ధరలు ఏ విధంగా పెరుగుతాయో కూడా అంచనా వేయకుండా ఆ ప్రచార సంస్థకు అప్పనంగా దోచిపెట్టేలా పాలకులు వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది. దీనికి తోడు అక్కడ ఉంటున్న వీధి వ్యాపారుల పొట్ట కొట్టి తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రచార సంస్థకు అవకాశం కల్పించడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారిపై రద్దీని దృష్టిలో పెట్టుకొని బస్‌షెల్టర్లతో భవిష్యత్తులో ప్రమాదాలు చోటు చేసుకోకుండా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలి

నరసరావుపేట: ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు మీరయ్యమాదిగ మాట్లాడుతూ గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్షకు రూ.50 వేలు సబ్సిడీపై రుణాలు ఇచ్చేవారన్నారు. బ్యాంకుల ద్వారా ఎస్సీలకు రుణాలు ఇప్పించాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ఉంటుందన్నారు. ఇప్పటివరకు రుణాలు మంజూరుకాకపోవటం శోచనీయమని అన్నారు. రానున్న రోజుల్లో కార్పొరేషన్ తీసేసే ప్రమాదం ఎక్కువగా కన్పిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ, ఎస్టీ సబ్సిడీ రుణాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనికి కలెక్టర్ స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారని మీరయ్యమాదిగ పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపోగు రమణరావు మాదిగ, కార్యకర్తలు శేషు, ఫ్లాంకిన్ పాల్గొన్నారు.

నిరసన విజయవంతం చేయాలి

శావల్యాపురం: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలుపుతూ మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు సోమవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిరసనకు సంబధించిన కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎస్టీయూ నాయకులు బిళ్ళా రాజారమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలే సరైనా మార్గమన్నారు. పాఠశాల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు ఐక్యంగా నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.